గురువులొస్తున్నారు!

జిల్లాలో భర్తీ కానున్న 172 పోస్టులు




జిల్లా కేంద్రంలో అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

గద్వాల న్యూటౌన్, గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు లేక గాడితప్పిన విద్యా వ్యవస్థ బలోపేతం కానుంది. వారు లేక ఇన్నాళ్లూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదు. గట్టు, అయిజ, రాజోలి మండలాల్లో ఉపాధ్యాయులు కావాలంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేసిన సంఘటనలు వెలుగు చూశాయి. ఇలాంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను వెల్లడించడం వెంటనే పోస్టుల భర్తీకి ఆదేశాలు జారీ చేయడంతో.. బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపికైన డీఎస్సీ అభ్యర్థుల నిజ ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. మొత్తం 516 మంది అభ్యర్థులు ఎంపికవగా, 1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల పత్రాలను ఈ నెల 5వ తేదీ వరకు జిల్లా విద్యా శాఖ అధికారులు పరిశీలించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించనున్నారు.

భర్తీ అయ్యే పోస్టులు ఇలా..: జిల్లాలో మొత్తం 460 ప్రభుత్వ పాఠశాలలుండగా, 69,200 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి బోధన చేసేందుకు 2,305 ఉపాధ్యాయ పోస్టులుండగా, ప్రస్తుతం 1,940 మంది ఉన్నారు. 365 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత డీఎస్సీలో 172 పోస్టులు భర్తీ కానున్నాయి. 72 మంది ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లు, 35 మంది ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్)లు, 28 మంది లాంగ్వేజ్ పండిట్‌లు, మిగిలినవి పీఈటీ, ఎస్ఏ ఉర్దూ, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు రానున్నారు.

సబ్జెక్టుల వారీగా: స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ) బయోసైన్సు 7, గణితం 5, ఫిజికల్ సైన్సు 6, తెలుగు 3, సోషల్ 7, ఉర్దూ 1, ఇంగ్లిష్ 6; లాంగ్వేజ్ పండిట్లు హిందీ 13, తెలుగు 15, సెకండరీ గ్రేడ్ టీచర్లు తెలుగు 72, ఉర్దూ 8, ఇంకా పీఈటీ 8, స్పెషల్ ఎడ్యుకేషన్ 21 పోస్టులు భర్తీ కానున్నాయి.

పెరగనున్న పర్యవేక్షణ: మూడు, నాలుగు మండలాలకు ఒక ఎంఈవో ఉండటంతో ఇన్నాళ్లూ పర్యవేక్షణ కొరవడింది. ఇదే అదునుగా కొందరు ఉపాధ్యాయులు ఇష్టారీతిగా వ్యవహరించడం, సమస్యలు చెప్పుకునేందుకు స్థానికంగా విద్యాధికారులు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మండలానికి ఒక ఎంఈవో చొప్పున 13 మండలాలకు 13 మంది ఎంఈవోలు బాధ్యతలు చేపట్టడంతో పాఠశాలలపై పర్యవేక్షణ పెరగనుంది.



నిబంధనల ప్రకారం..

ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల ఆధారంగా ప్రస్తుతం 1:3 ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నాం. అభ్యర్థుల వివరాలు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారు తుది ఎంపికలు చేపడతారు. ఉపాధ్యాయుల నియామకంతో టీచర్లు లేక ఇబ్బంది పడుతున్న పాఠశాలలకు ఊరట కలగనుంది.

-రవీందర్, డీఈవో, గద్వాల

తొలి రోజు 88 మంది ధ్రువపత్రాల పరిశీలన

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డీఎస్సీ అభ్యర్థుల విద్యా ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. 1:3 నిష్పత్తిలో ఎంపికైన ఎస్జీటీ అభ్యర్థులు పరిశీలనకు హాజరయ్యారు. తొలి రోజు 88 మంది ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ తెలిపారు. 5వ తేదీ వరకు పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. అభ్యర్థుల ఒరిజనల్ విద్యా ధ్రువపత్రాలను జిల్లా పర్యవేక్షక అధికారులు సురేశ్, నరేశ్, ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో పరిశీలించారు. డీఈవో కార్యాలయ పర్యవేక్షకులు రామకృష్ణ, విజయలక్ష్మి, పరిశీలనాధికారులు రవీంద్రబాబు, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయం వద్ద 55,800 క్యూసెక్కుల వరద నీటి ఉద్ధృతి కొనసాగుతున్న పరిస్థితుల్లో విద్యుదుత్పత్తికి 41,039 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.158, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.400 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలం బుధవారం నాటికి ఎగువన 220.143, దిగువన 195.234 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

కొండలు.. గుట్టలు.. మాయం!

అభివృద్ధి పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, ధరూర్: పాలమూరులో జాతీయ రహదారుల నిర్మాణం మాటున ప్రకృతి సంపద మాయం అవుతోంది. ఆయా జిల్లాల్లో రోడ్ల నిర్మాణం జరిగే పరిసర ప్రాంతాల్లో కొండలు, మట్టి గుట్టలు ఆనవాళ్లు లేకుండాపోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. మొరం, క్వారీ తవ్వకాలకు తహసీల్దార్ నుంచి ఎన్ఓసీ తీసుకుని ఆ లేఖను గనుల శాఖకు ఇవ్వాలి. సర్వేయర్ వచ్చి ఎక్కడ మైనింగ్‌కు అవకాశం ఉందా? లేదా? ఎంత మేర తవ్వాలి? ఎంత మేర తరలించాలి? సీనరేజీ ఛార్జీలు ఎంత చెల్లించాలి? వంటివి పరిశీలించి అనుమతులిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి రూ.కోట్లలో సీనరేజి ఛార్జీల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



శాంతినగర్‌లో మొరం కోసం ఇలా..

ఎన్‌హెచ్‌150ఎన్: గద్వాల జిల్లా నందిన్నె నుంచి ఏపీలోని నంద్యాల వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.1,568 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.470 కోట్లు

జరిమానా విధించినా..: ● మొరం టన్నుకు రూ.35, రాళ్లకు టన్నుకు రూ.80 వరకు సీనరేజీ ఛార్జీలు మైనింగ్ శాఖకు చెల్లించాలి. గతేడాది గద్వాల జిల్లాలో అక్రమ తవ్వకాలు జరిపినందుకు గనులశాఖ జరిమానా విధించింది. ప్రభుత్వానికి రూ.4.95 కోట్లు సీనరేజీ ఛార్జీలు, రూ.1.48కోట్లు జిల్లా మినరల్ ఫండ్, రాష్ట్ర మినరల్ ఫండ్ రూ.9.90 లక్షలు, ఆదాయం పన్ను రూ.9 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అయినా గుత్తేదారు సంస్థ స్పందించకపోవడంతో 10 రెట్ల జరిమానాతో రూ.52 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు అందించారు. తాజాగా గట్టు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న పలుగురాళ్లపై రూ.4 కోట్ల వరకు జరిమానా విధించింది.

● మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి పేరుతో హన్వాడ, మహ్మదాబాద్, గండీడ్‌లో మొరం, మట్టి, కంకర కోసం పెద్ద ఎత్తున గుట్టల్ని ధ్వంసం చేస్తున్నారు. గుట్టల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసుకుని మరీ తవ్వుతున్నారు. జిల్లాలో మైనింగ్ శాఖ ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో యథేచ్ఛగా సంపదను కొల్లగొట్టేస్తున్నారు. సీనరేజీ ఛార్జీలు నేరుగా తమ ఖాతాలో జమవుతున్నాయని జిల్లా అధికారులు పట్టించుకోపోవడంతో సుమారు రూ.10 కోట్ల విలువైన మొరం, కంకర, పలుగురాళ్ల వ్యాపారం చేపట్టినట్లు సమాచారం.



ఊర్కొండపేటలో కరుగుతున్న గుట్ట

ఎన్‌హెచ్–167ఎన్: మహబూబ్‌నగర్–చించోళి వరకు (60 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.703.68 కోట్లు
మట్టి పని విలువ: సుమారు రూ.211 కోట్లు

గ్రామాలకు అందని డబ్బు..: సీనరేజీ ఛార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు వచ్చిన నిధుల్లో 25 శాతం గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్తులకు 50 శాతం కేటాయించాలని కేంద్ర నిబంధనలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో మూడు జాతీయ ప్రాజెక్టులకు కలిపి సుమారు రూ.150 కోట్ల వరకు సీనరేజీ ఛార్జీల రూపంలో చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కటే ఖాతా ఉండటంతో అన్నీ అందులోనే జమవుతున్నాయి. అసలు సీనరేజీ ఛార్జీలు వస్తున్నాయో? లేదో? కూడా గనులశాఖకు అవగాహన ఉండడం లేదు. దీనిపై మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల మైనింగ్ శాఖ అధికారులు 'ఈనాడు'తో మాట్లాడుతూ అనుమతులున్న చోటే తవ్వకాలు జరపాలని చెప్పారు. ఇష్టారాజ్యంగా తవ్వితే జరిమానా విధిస్తామన్నారు. జాతీయ రహదారి డీఈ రమేశ్ మాట్లాడుతూ రహదారుల పనుల్లో మొరం, కంకర కోసం అనుమతులు తీసుకుంటామని, వాటి డబ్బు నేరుగా మైనింగ్ శాఖకు చెల్లిస్తామని చెప్పారు. గద్వాల జిల్లా పంచాయతీ అధికారి శ్యాంసుందర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు రూపాయి కూడా సీనరేజీ ఛార్జీల రూపంలో గ్రామాలకు రాలేదన్నారు.

ఎన్‌హెచ్–167కే: కల్వకుర్తి – కొల్లాపూర్ వరకు (77 కిలోమీటర్లు)
మొత్తం విలువ: రూ.886.69
మట్టి పని విలువ: సుమారు రూ.266 కోట్లు



గండీడ్ మండలం గోవింద్‌పల్లిలో తవ్వకాలు

● నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేట వద్ద ఓ గుట్టను కొల్లగొడుతున్నారు. జాతీయ రహదారి పనుల పేరుతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల అవసరాలకు మట్టిని తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలోని పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. సుమారు రూ.5 కోట్ల విలువైన వ్యాపారం మైనింగ్ పేరుతో జరిగినట్లు అంచనా.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చింతలపేట ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ పోటీలను ప్రారంభించారు. అండర్-14, 16, 18, 20 బాలురు/బాలికల విభాగంలో 60, 100, 400, 800, వెయ్యి మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో పోటీలను నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను ఎంపికచేసి ఈ నెల 7, 8వ తేదీల్లో హనుమకొండలో జరిగే స్టేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్ పోటీలకు పంపనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసన్న, ప్రధాన కార్యదర్శి సతీష్ తెలియజేశారు.



హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

తీరంలో గలీజు

ఎసైన్‌మెంట్ కమిటీ భూముల్లో కొత్తకోణం



కృష్ణా నది తీరంలో సాగవుతున్న ప్రభుత్వ భూమి

న్యూస్‌టుడే–మాగనూరు

కృష్ణా నది తీరంలో దశాబ్దాల క్రితం బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం ద్వారా సంక్రమించిన అసైన్‌మెంట్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. కృష్ణా, మాగనూరు మండలాల్లో 2140 ఎకరాలు వివిధ సంవత్సరాల్లో లబ్ధిదారులకు పంచారు. పట్టాలు ఇచ్చినా భూమి ఎక్కడుందో చాలామంది లబ్ధిదారులకు చెప్పకపోవడంతో వారంతా ఏళ్లతరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయమై గత నెల 26న 'ఈనాడు'లో 'తీరంలో భూ మాయ' శీర్షికన కథనం రావడంతో యంత్రాంగంలో చలనం వచ్చింది. ఈ క్రమంలో మరో కోణం వెలుగు చూస్తోంది. అప్పట్లో కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు కొందరు లబ్ధిదారులతో ఏమీ చెప్పకుండా వేలిముద్రలు వేయించి 99 ఏళ్లకు లీజుకు తీసుకున్నట్లు పత్రాలు సృష్టించారు. దశాబ్దాలు గడిచిపోవడంతో కొందరు లబ్ధిదారులు కాలం చేశారు. అసైన్‌మెంట్ భూములు రిజిస్ట్రేషన్ కావని అందరికీ తెలిసిందే. అప్పట్లో కొందరు మధ్యవర్తులు గుట్టుగా ఈ పని చేయించారు.

● కృష్ణా మండలం అయినాపూర్, తంగడిగి, కుసుమర్తి, కాలహళ్లి, గుర్జాల, గుడేబల్లూర్ శివారుల్లోని చాలామేరకు ప్రభుత్వ భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నాయి. లబ్ధిదారుల వారసులు కొందరికైతే తమ పేరిట ప్రభుత్వ భూమి ఉందని తెలియదు. ● భూ సంస్కరణ చట్టంలో లొసుగుల ఆధారంగా ఇప్పటికే చాలా మందికి ప్రభుత్వం ద్వారా సంక్రమించిన భూములు ఇతరుల పేరిట మారిపోయాయి. లీజుకు ఇవ్వని మరికొన్ని భూములు కూడా అన్యాక్రాంతం అయ్యాయి. ఉదాహరణకు మురహరిదొడ్డి శివారులో 7 ఎకరాలు ఇతరుల పేరిట మారిపోయింది. అయినాపూర్ పరిధిలో దాదాపు 50 ఎకరాలకు పైగా బడుగు బలహీన వర్గాల పేరిట అలాగే ఉంది. ప్రస్తుతం కాస్తులో వేరేవారు ఉన్నారు. పట్టాదారుల కుటుంబీకులు వలస వెళ్లిపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు.

● ఈ రెండు మండలాల్లో బడుగు, బలహీన వర్గాల లబ్ధిదారులు తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పడానికి బయటకు రావడంలేదు. పెద్దలతో తమకు తలనొప్పి ఎదురవుతుందని భయపడుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారుల పేర్లు మారిన వ్యవహారం, అలాగే 99 ఏళ్ల లీజు సంగతి తేల్చాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇస్తాం: కృష్ణా నదీ తీరంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. రికార్డులలో ఉన్న లబ్ధిదారులు కాస్తులో ఉన్నారా లేదా అన్నది ముందు గుర్తించి హైడ్రా తరహాలో నోటీసులు ఇస్తాం. ఈ విషయంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తాం. ఉన్నతాధికారులకు నివేదించాక చర్యలు చేపడతాం.

- దయాకర్‌రెడ్డి, తహసీల్దారు, కృష్ణా

అలంపూర్ చౌరస్తాలో రిజిస్ట్రేషన్ల దందా



అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ చౌరస్తాలో ప్లాట్ల డబుల్ రిజిస్ట్రేషన్ దందా కొనసాగుతోంది. ఇక్కడ భూముల విలువ విపరీతంగా పెరిగిపోవటంతో దందా కూడా అదే స్థాయిలో జరుగుతోంది. దీంతో కష్టపడి కూడబెట్టిన సొమ్ముతో ప్లాట్లు కొనుక్కుంటున్న ప్రజలు మోసపోతున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లను ఇద్దరి పేర్లపై రిజిస్ట్రేషన్లు చేస్తూ కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. పైరవీకార్లు, రియల్టర్లు ప్రజలకు ప్లాట్లు తమవేనని చెబుతూ రిజిస్ట్రేషన్ చేయించేస్తున్నారు.

ఇదిగో..: చౌరస్తాలోని సర్వే నంబర్ 304 ప్లాట్ నంబర్ 88ని చిన్న అముదాలపాడుకు చెందిన గొల్ల శేషమ్మ 2019లో (దస్తావేజ్ నెంబర్ 2840/2019) కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఆ స్థలంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా మరో వ్యక్తి వచ్చి ఇది నా ప్లాట్ ఎందుకు శుభ్రం చేస్తున్నావని ప్రశ్నించారు. కాదు, ఇది నేను కొనుగోలు చేశాను, కావలిస్తే రిజిస్ట్రేషన్ పత్రాలు చూడండి అంటూ గొల్ల శేషమ్మ చూపించింది. మరి ఇదే ప్లాటు తనకూ రిజిస్ట్రేషన్ చేసినట్లు పత్రాలు ఉన్నాయని చూపించారు. ఒకే ఇంటి స్థలాన్ని ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేయడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మొదట ఎవరు కొనుగోలు చేస్తారో వారికి హక్కు ఉంటుందని రిజిస్ట్రేషన్ అధికారి చెబుతున్నారు. ఇదే సర్వే నంబర్‌లో ప్లాటు నంబర్ 89 సైతం డబుల్ రిజిస్ట్రేషన్ కావడంతో ఉండవల్లికి చెందిన గొల్ల మద్దిలేటి లబోదిబోమంటున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లు డబుల్ రిజిస్ట్రేషన్ కావడంతో అయోమయంలో పడ్డారు. నాలుగు రోజుల కిందట గొల్ల శేషమ్మ, గొల్ల మద్దిలేటి ఉండవల్లి ఠాణాలో తమకు ప్లాటు అమ్మిన వ్యక్తిపై ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.



గొల్ల మద్దిలేటి ఉండవల్లి



గొల్ల శేషమ్మ చిన్న అముదాలపాడు

● చౌరస్తాలో ప్రభుత్వ అసైన్డ్ భూములను సైతం ఇంటి స్థలాలుగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు కొందరు. ప్రస్తుతం అలంపూర్ చౌరస్తాలో సెంటు భూమి ధర రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పలుకుతోంది. ఇదే రోడ్డు సైడ్ ప్లాట్ అయితే సెంటు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంది.

మాకు రెవెన్యూ వస్తే చాలు: ఈ విషయమై అలంపూర్ ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ ఇబ్రహీంను వివరణ కోరగా మాకు రెవెన్యూ వస్తే చాలు. . మేము రిజిస్ట్రేషన్ చేస్తాం.. కొనుగోలు చేసుకునే వ్యక్తులు ఈసీలో ఎవరి పేరుపై ఉందో చూసుకోవాలన్నారు. అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేయకూడదని తెలిపారు.

పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: 2024-25 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలకు ఆదాయ పరిమితి రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షల పెంచినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన విధివిధానాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో మార్పు చేసినట్లు చెప్పారు. ముందుగా ఆన్‌లైన్‌లో ఎస్సెస్సీ, ఆధార్‌కార్డు వివరాలతో తాత్కాలిక ఈ-పాస్ ఐడీ 12 అంకెలతో ఇస్తారన్నారు. ఆ నంబర్‌తో దగ్గరలోని మీ సేవ కేంద్రం వద్ద బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. బయోమెట్రిక్ అనంతరం విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్‌ను సంప్రదించి పూర్తిస్థాయిలో నమోదు పూర్తిచేసి సంబంధిత కళాశాలలో సమర్పించాలన్నారు.

మహనీయుల త్యాగాలు మరవలేనివి



రాజవీధిలోని గాంధీ విగ్రహం వద్ద కలెక్టర్ సంతోష్

గద్వాల కలెక్టరేట్, అర్బన్, న్యూస్‌టుడే: సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు మహాత్మగాంధీ అని, ఆయన సేవలు మరవలేనివని జిల్లా కలెక్టర్ సంతోష్ కొనియాడారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని రాజవీధిలో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజీవ్‌మార్గ్‌లోని లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఐడీవోసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆర్డీవో రాంచందర్, జడ్పీ సీఈవో కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు. గద్వాల పురపాలక సంఘంలో పనిచేస్తున్న స్వీపర్ సైదమ్మ, కామాటీ హరిప్రసాద్, ఆశ వర్కర్ శ్రీదేవి, ఔట్ రిచ్ వర్కర్, బాలల రక్షణ భవనంలో పనిచేస్తున్న శ్రీలక్ష్మీదేవిలను ఎంపిక చేసి కలెక్టర్ సన్మానించారు.

సేవలు ఆదర్శనీయం: మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్‌శాస్త్రిలు దేశానికి అందించిన సేవలు ఆదర్శనీయమని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గద్వాలలోని జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఇద్దరు నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి సీఐ నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావు, పోలీసు అధికారులు

చుక్కల్లో కూరగాయల ధరలు

గట్టు, న్యూస్‌టుడే: ఓవైపు కూరగాయల ధరలు, మరో వైపు నిత్యావసర సరుకుల ధరలు ఇటీవల విపరీతంగా పెరుగుతుండటంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. మండల కేంద్రంలో బుధవారం నాటి వారాంతపు సంతలో దాదాపు అన్ని కూరగాయల ధరలు ఆకాశంలో విహరించాయి. టమాట రూ.80, ఉల్లి రూ.80, బీర రూ.70, బీన్స్ రూ.70 మిగతా కూరగాయలు సైతం రూ.70 పైనే పలకటంతో వినియోగదారులు ఆందోళనకు గురయ్యారు. ఇందుకు తోడు కందిపప్పు, మంచి నూనె ధరలు సైతం దాదాపు 30 శాతం అధికంగా పెరగటంతో ప్రజలు బెంబేలెత్తారు. ప్రభుత్వం స్పందించి నిత్యావసర, కూరగాయల ధరలను అదుపులోకి తేవాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గట్టు వారాంతపు సంతలో కూరగాయల కొనుగోళ్లు

నేటి నుంచి సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు



బెంచీలపై హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న నిర్వాహకులు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని రెండు పరీక్షా కేంద్రాల్లో గురువారం నుంచి సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గద్వాలలో పది పరీక్షలకు ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో, ఇంటర్ పరీక్షలకు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. పది పరీక్షలకు 146 మంది, ఇంటర్ పరీక్షలకు 177 మంది హాజరు కానున్నారని చెప్పారు. గురువారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు జరిగే పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ అధికారిగా రామన్న, డిపార్ట్‌మెంటల్ అధికారిగా సవారన్న, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ అధికారిగా మహేశ్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా జహీరుద్దీన్‌లు వ్యవహరించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో చరవాణితో పాటు ఇతర ఏ ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని చెప్పారు. సకాలంలో కేంద్రానికి చేరుకోవాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు.

నవోదయలో ప్రవేశాలకు తరుణమిదే



నవోదయ విద్యాలయం ముఖద్వారం

మిగులు సీట్ల భర్తీ

2025-26లో మిగులు సీట్ల భర్తీకి ప్రకటన వెలువడింది. 9వ తరగతిలో చేరేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 01.05.2010 నుంచి 31.07.2012 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు ప్రస్తుతం పదోతరగతి చదువుతూ 01.06.2008 నుంచి 31.07.2010 మధ్య జన్మించిన వారై ఉండాలి. విద్యార్థులు అక్టోబరు 30 లోగా విద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. రాత పరీక్ష ఫిబ్రవరి 08 2025న నిర్వహిస్తారు.

బిజినేపల్లి, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలకు దీటుగా అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది వట్టెం నవోదయ విద్యాలయం. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలో 1994లో దీనిని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఎంతోమంది ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఎంచుకున్న రంగాల్లో స్థిర పడేందుకు దోహదపడింది. నూతన ప్రవేశాలకు ప్రకటన వెలువడిన నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

ఎంపిక విధానం ఇలా..

నవోదయ విద్యాలయం ఏటా ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు 01.05.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించి ఉండాలి. మొత్తం 80 సీట్లకు 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో జనరల్ 37, ఓబీసీలకు 22, ఎస్సీలకు 12, ఎస్టీలకు 6, దివ్యాంగులకు 3 సీట్లు కేటాయిస్తారు. ప్రతి కేటగిరీలోనూ బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ: 07 అక్టోబరు 2024. 18 జనవరి 2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

● ఈ విద్యాలయంలో చదువుతోపాటు విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా క్రీడలు, చిత్రలేఖనం, సంగీతం, యోగా, కరాటే వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సేవా భావం అలవాటు పడేలా ఎన్‌సీసీని నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తోంది.

● విద్యాలయంలో ప్రవేశాలు మెరిట్ ప్రకారమే ఉంటాయి. ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించవద్దు. అభ్యర్థి సామర్థ్యాన్ని బట్టి సీబీఎస్‌ఈ ద్వారా ఎంపిక ఉంటుంది. ఎవరైనా సీటు ఇప్పిస్తామని మభ్యపెడితే ఫిర్యాదు చేయాలి.

- భాస్కర్‌కుమార్, ప్రిన్సిపల్ నవోదయ విద్యాలయ సమితి.

అమ్మవారి క్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ



విద్యుత్తు దీపాల అలంకరణలో ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగులాంబ అమ్మవారి దేవాలయం

న్యూస్‌టుడే,అలంపూర్, మహబూబ్‌నగర్ సాంస్కృతికం

దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఆలయాల్లో శైవ సంప్రదాయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు, వైష్ణవ సంప్రదాయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇదే మాసంలో నిర్వహిస్తారు. కొత్తగా పెళ్లయిన ఆడబిడ్డలు పుట్టింటికి చేరుకుంటారు. ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండగ నిర్వహిస్తారు. రకరకాల పిండివంటలు చేసుకుంటారు. ఊరూరా నెల కొల్పే దుర్గామాత విగ్రహాల వద్ద కోలాటాలు, బతుకమ్మ ఆటలతో సాంస్కృతిక శోభ ఉట్టిపడనుంది. పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాలను తీసుకుని యుద్ధం చేసి శత్రువులను ఓడించిన వృత్తాంతాన్ని గుర్తుచేసుకుంటూ దసరా రోజు సాయంత్రం వేళ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేస్తారు. అనంతరం శమీపత్రాలను తల్లిదండ్రులు, పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. పలు చోట్ల రావణ దహనం కార్యక్రమం చేపడతారు. మన్యంకొండ శ్రీవేంకటేశ్వరస్వామి, చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తిస్వామి, బీచుపల్లి ఆంజనేయస్వామి, మద్దిమడుగులోని ఆంజనేయ స్వామి, పాలెం, కోస్గిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైష్ణవ సంప్రదాయం ప్రకారం వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

శక్తిపీఠంలో వైభవంగా ఉత్సవాలు



రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగులాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భారీగా తరలివచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించటంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. నవరాత్రుల్లో అమ్మవారు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటాదేవి, కూష్మాండదేవి, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాత్రిగా ప్రత్యేక దర్శనమిస్తారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ త్రిశతి, ఖడ్గమాల అర్చనలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా కుమారి, సువాసిని పూజ నిర్వహిస్తారు. ఆలయ ప్రధాన అర్చకులు డిండిగల్ ఆనంద్‌శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, హారతితో పూజలు ప్రారంభించి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహిస్తారు. సహస్ర నామార్చన, నవవర్ణ అర్చన, తర్వాత చండీ హోమం ఉంటాయి. 9న ఉదయం 10 గంటలకు మూలానక్షత్ర శుభ సమయమున జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు సింహవాహన సేవ, 10న దుర్గాష్టమి సందర్భంగా ఉదయం 10 గంటలకు రథోత్సవం, 11న మహార్నవమి పురస్కరించుకుని కాళరాత్రి పూజ నిర్వహిస్తారు. 12న విజయదశమి రోజు ఉదయం 8 గంటలకు మహాపూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు శమీపూజ, 6.30 గంటలకు నదీహారతులు, జోగులాంబ అమ్మవారు, శ్రీబాలబ్రహ్మేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను హంసవాహనంలో ఆసీనులను చేసి తుంగభద్ర నదిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ వేడుకలో సుమారు 15 వేలమంది వరకు భక్తులు పాల్గొంటారని ఆలయం ఈవో పురేందర్ తెలిపారు.

ఉత్సవ సమయంలో అలంపూర్ ఆలయాల్లో ఆర్జిత సేవలు

ఆర్జిత సేవ	సమయం	రుసుము(రూ.ల్లో)
సహస్రనామార్చన	ఉ॥ 7.30 నుంచి సా॥ 6 వరకు	1,000
శ్రీచక్ర నవావరణ అర్చన	ఉ॥ 9 గంటలకు	500
త్రిశతి అర్చన	ఉ॥ 8 నుంచి 11.30	500
ఖడ్గమాల అర్చన	మ॥ 2 నుంచి సా॥ 4 వరకు	300
చండీహోమం	ఉ॥ 10 గంటలకు	1,000
రథోత్సవం	సా॥ 6.30 గంటలకు	1,000
కొలువు పూజ, దర్బారు సేవ, సువాసిని, కుమారి పూజలు	సా॥ 7 గంటలకు	300
సామూహిక కుంకుమార్చన	మధ్యాహ్నం 2.30 నుంచి 3.30	ఉచితం
ఉదయాస్తమయ సేవ		3,000

(త్రిశతి, ఖడ్గమాల అర్చనలు కుంకుమార్చన మండపంలో నిర్వహిస్తారు)



విద్యుత్తు దీపకాంతుల్లో మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం

ఎల్లమ్మ ఆలయంలో సందడి

మహబూబ్‌నగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. దేవాలయాన్ని సుందరంగా అలంకరించారు. రోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచి మూలవిరాట్టుకు అభిషేకాలతో పూజలు ప్రారంభిస్తారు. అలంకరణ, కుంకుమార్చన మహానివేదన తర్వాత భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయి. అమ్మవారిని 3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న గాయత్రీదేవి, 6న వనదుర్గాదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న శాకాంబరీదేవి, 9న సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. 10న కాళికాదేవిగా నిమ్మకాయలు, గుమ్మడికాయలతో అలంకరణ చేసి కుంభం పోస్తారు. 11న దుర్గాదేవి 12న రేణుకాఎల్లమ్మగా అలంకరించి ఆలయ వద్ద ఉన్న జమ్మిచెట్టుకు పూజ చేస్తారు. స్థానిక అంబాభవాని, కాళికాదేవి, మహబూబ్‌నగర్, జడ్చర్లలోని వాసవీమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



అలంపూర్ ఆలయ స్వాగత తోరణం

ఇలవేల్పుగా జములమ్మకు పూజలు



ముస్తాబైన జములమ్మ దేవత ఆలయం

గద్వాల కలెక్టరేట్ : గద్వాల సమీప జమ్మిచేడులో వెలసిన జములమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతివారం మంగళ, శుక్రవారాల్లో 10వేల వరకు భక్తులు దర్శించుకుంటారు. కలశస్థాపనతో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభిస్తారు. రోజూ ఉదయం 8 గంటలకు విశేష ఫలపంచామృతాభిషేకం, అలంకరణ పూజలుంటాయి. తొమ్మిది రోజుల్లో మహాలక్ష్మీదేవి, గజలక్ష్మి, అన్నపూర్ణదేవి, శాకాంబరిదేవి, పార్వతి, ధనలక్ష్మి సరస్వతీమాత, దుర్గాదేవి, మహిషాసురమర్ధినిగా దర్శనమిస్తారు. చివరిరోజు జములమ్మ నిజరూపంలో దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కోనేరులో తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు.

అడవి మధ్యలో కొలువైన మైసమ్మ



నవాబుపేట మండలం కాకర్లపాడు పరిధి అటవీ ప్రాంతంలో వెలసిన ఫతేపూర్ మైసమ్మ దేవత భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారు. ప్రతి ఆది, మంగళవారాల్లో వేలాది భక్తులు దర్శించుకుంటారు. శరన్నవరాత్రుల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వస్తారని ఆలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. నవరాత్రులను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, చక్రపూజ కైంకర్యాలతో అమ్మవారిని పూజిస్తారు. నవరాత్రుల్లో మూలవిరాట్టుకు రోజుకో అలంకరణ చేసి ఆరాధించనున్నట్లు ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ తెలిపారు.

ఐదుగురు సంతానమున్నా..
అనాథలుగా తల్లిదండ్రులు



ఆకలి తీరుస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు

కాటేదాన్, న్యూస్‌టుడే: కన్నబిడ్డలు ఐశ్వర్యం అని తల్లిదండ్రులను అక్కున చేర్చుకోలేదు. వారికి దూరంగా జీవించాలని ఉద్దేశంతో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం మాసన్‌పల్లికి చెందిన వెంకటయ్య, నరసమ్మ దంపతులు రెండు వారాల క్రితం రాజేంద్రనగర్ చేరుకున్నారు. గగన్‌పహాడ్.. బెంగళూరు జాతీయరహదారిలోని అండర్ పాస్ కింద తలదాచుకుంటున్నారు. ఆ వృద్ధ జంటను రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదుకుని ఆకలి తీరుస్తున్నారు. బుధవారం 'న్యూస్‌టుడే' వారిని పలకరించగా.. 'మాకు నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు. ఆడపిల్లలకు వారి సమస్యలు వారికుంటాయి...కొడుకూ మమ్మల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఛీదరించుకుంటున్నాడు. అటు కొడుకు, ఇటు కూతుళ్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు పదేపదే మమ్మల్ని ఈ విషయం అడుగుతున్నారు. వారిని బద్నాం చేయలేక ఇలా వచ్చేశాం. పోలీసులు మా కడుపు నింపుతున్నారు. మా పిల్లల ఫోన్ నెంబర్లు తీసుకుని వారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నా స్పందన లేదు. మేము పనిచేసే స్థితిలో లేం.. ఏమి చేయాలో అర్థం కావడం లేదు' అంటూ కన్నీళ్లపర్యంతమయ్యారు. ట్రాఫిక్ ఎస్సై రాజేందర్ మాట్లాడుతూ వారి పిల్లలతో మాట్లాడి తీసుకెళ్లేలా చూస్తాం.. అలా అవకాశం లేనప్పుడు ఉన్నతాధికారులతో చర్చించి ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించేందుకు చొరవ తీసుకుంటామని చెప్పారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



మల్దకల్, న్యూస్‌టుడే: అమావాస్య సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి సాయంత్రం పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఆదిశిలావాసుడి మూలవిరాట్



బాగుపడిన పుష్కరఘాట్

ఈనాడు కథనానికి స్పందన

జోగులాంబ ఆలయ పుష్కరఘాట్ దుర్భరంగా ఉన్న పరిస్థితిపై సెప్టెంబరు 30వ తేదీన 'పుణ్యస్నానాలు చేసేదెలా' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆలయ అధికారులు స్పందించి ఘాట్‌లోని చెత్తాచెదారం తొలగించారు. పిండ ప్రదానం చేసేందుకు ప్రత్యేకంగా ఒక వైపు టెంట్ ఏర్పాటు చేశారు. అటు వైపు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

చెరువులో పడి యువకుడి మృతి



శ్రీకాంత్

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు మండలం చెన్నరెడ్డిపల్లిలో చెరువులోపడి యువకుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన సాయిలు, మొగులమ్మ దంపతుల కుమారుడు శ్రీకాంత్(20) బుధవారం ఉదయం స్నానం చేయడానికి స్నేహితులతో కలిసి చెరువుకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా అదుపు తప్పి చెరువులో మునిగిపోయాడు. ఈత రాకపోవడంతో బయటపడలేకపోయాడు. స్నేహితులు బయటకు తీసేసరికి అప్పటికే శ్రీకాంత్ మరణించాడు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు..

భూత్పూర్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. 25 - 30 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం ద్విచక్రవాహనంపై బిజినేపల్లి మార్గంలో వెళ్తుండగా వెల్కిచర్ల పెట్రోల్ బంకు నుంచి బయటకు వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి, తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన ద్విచక్రవాహనం భూత్పూర్ పురపాలిక గోప్లాపూర్‌కు చెందినది గుర్తించారు. ఈ వాహనం చోరీకి గురైందని దాని యజమాని ఇప్పటికే ఠాణాలో ఫిర్యాదు చేశారు. వ్యక్తి మృతికి కారణమైన కారును ఠాణాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, సంబంధితులు ఉంటే మృతదేహం కోసం తమను సంప్రదించాలని ఎస్సై చంద్రశేఖర్ కోరారు.

రైలు ఢీకొని ఒకరి దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలైన చెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం.. మహబూబ్‌నగర్ పట్టణం తిరుమలదేవుని గుట్ట (టీడీగుట్ట) రైల్వే గేటు వద్ద రైలు పట్టాల సమీపంలో సుమారు 35 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి బహిర్భూమికి వెళ్లగా రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతుడి జేబులో ద్విచక్రవాహనం తాళం చెవి ఉండటంతో సమీపంలోని అన్ని ప్రదేశాల్లో వాహనం కోసం వెతికినా లభించలేదు. సంబంధితులు ఎవరైనా ఉంటే మృతదేహం కోసం రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్సై కోరారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

జడ్చర్ల, న్యూస్‌టుడే : అప్పుల బాధతో ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జడ్చర్ల మండలంలో వెలుగు చూసింది. సీఐ ఆదిరెడ్డి కథనం ప్రకారం.. పోలేపల్లి గ్రామానికి చెందిన మిద్దె గణేశ్(18) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులు చనిపోవడంతో పెద్ద అక్క వద్ద మరో సోదరి, ఆయన ఉంటున్నారు. వివిధ అవసరాల కోసం చేసిన అప్పులు పెరిగాయి. ఈ నెల 1న తెలిసిన వారి వద్ద అప్పు తీసుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబానికి చెందిన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గ్రామస్థులు బుధవారం ఉదయం గుర్తించారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు అక్క నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

సమాజంలో మార్పు అవసరం

● శివార్చక విజయకుమార్

● అలంపూర్‌లో బాపూ సత్యశోధన పాదయాత్ర ప్రారంభం



అలంపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర

అలంపూర్, న్యూస్‌టుడే: ప్రస్తుత సమాజంలో మార్పు అవసరమని విశ్రాంత డీఈవో శివార్చక విజయకుమార్ పేర్కొన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్‌ల ఆధ్వర్యంలో బుధవారం అలంపూర్ ఆలయాల నుంచి ఆయన సారథ్యంలో బాపూ సత్యశోధన పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పిల్లలు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేలా చైతన్యపరచడమే యాత్ర ఉద్దేశమని వివరించారు. పిల్లలే దేశ భవిష్యత్తని, వారిని వ్యసనాలకు దూరంగా క్రమశిక్షణతో ఉంచాల్సిన బాధ్యత పెద్దలదేనని ఆయన పేర్కొన్నారు. గాంధీ సిద్ధాంతాలు పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. పాదయాత్ర పట్టణంలోని వివిధ కాలనీల్లో కొనసాగించారు. గురువారం ఉదయం అలంపూర్ పట్టణం నుంచి ఉండవల్లికి పాదయాత్ర సాగుతుంది. 100 రోజుల పాటు వెయ్యి కిలోమీటర్లు సాగిన అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ఉమామహేశ్వర ఆలయం వద్ద వచ్చే జనవరి 12న ముగుస్తుంది. కన్యకా పరమేశ్వరి అన్నదాన సత్రంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బి.ఎన్.వేణుగోపాల్, వెంకట్రామయ్యశెట్టి, ఎన్‌ఐపీ సంస్థ నాగేంద్రస్వామి, కల్కూర్ చంద్రశేఖర్, మాధవరెడ్డి, కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు



మైదానాన్ని చదును చేయిస్తున్న అధికారులు

ధన్వాడ, న్యూస్‌టుడే : స్థానిక అప్పాజీ మైదానంలో గురువారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) బాలికల రెజ్లింగ్(కుస్తీ) పోటీలను నిర్వహిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు సారథ్యంలో పీడీలు రవికుమార్, సాయినాథ్, బాల్‌రాజు, రామకృష్ణ, కోచ్ శ్రీనివాస్ ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టిపోసి మైదానాన్ని సమాంతరంగా చేస్తున్నారు. అండర్ 14, 17, 19 ఏళ్ల విభాగాలలో పోటీలు జరుగుతాయి. పాత జిల్లాలవారీగా జట్లు పోటీలకు వస్తున్నాయి. క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

ఒకరికి బదులుగా మరొకరిపై వేటు

కానిస్టేబుల్ సస్పెన్షన్‌లో తప్పు సరిదిద్దుకున్న పోలీసు శాఖ

కందనూలు, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న జంటల చిత్రాలు తీసి డబ్బులు వసూళ్లకు పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లు రామచందర్, చిన్నాను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సెప్టెంబరు 25న సస్పెండ్ చేశారు. కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌లో మరో కీలక మలుపు తిరిగింది. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఠాణాలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చిన్నా స్థానంలో రామును సస్పెండ్ చేయాల్సి ఉండగా అధికారులు పొరపాటున ఇదే ఠాణాలో పని చేస్తున్న చిన్నాను సస్పెండ్ చేశారు. ఎలాంటి కారణం లేకుండా సస్పెండ్ చేయడంతో బాధితుడు చిన్నా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి వివరాలు అందజేశారు. ఎస్పీ ఆదేశాల ప్రకారం బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ కనకయ్య ఆధ్వర్యంలో మరోసారి విచారణ నిర్వహించి పూర్తి నివేదికను ఎస్పీకి అందజేశారు. ఎస్పీ ఉత్తర్వుల ప్రకారం కానిస్టేబుల్ రామును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుల్ చిన్నాకు పట్టణంలోని ఠాణాలో పోస్టింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రూ.50 లక్షలు ఇవ్వాలంటూ.. నక్సలైట్ పేరుతో బెదిరింపు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : తను నక్సలైట్ అని.. రూ.50 లక్షలు ఇవ్వాలని.. లేదంటే చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ బుధవారం తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సోళీపురం గ్రామానికి చెందిన తేనేటి శేఖర్‌రెడ్డి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఓ కొత్త నంబరు నుంచి ఆయన చరవాణికి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు సుదర్శన్ రెడ్డి, నక్సలైట్ అని చెప్పారు. వెంటనే రూ.50 లక్షలు ఇవ్వాలని లేదంటే చంపుతానని బెదిరించారు. దీంతో బాధితుడు ఎస్పీ రావుల గిరిధర్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించారు. ఎస్సై సురేశ్‌గౌడ్ మంగళవారం రాత్రి ఇద్దరు కానిస్టేబుళ్లతో ఆయనకు భద్రత కల్పించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

సమస్య : రాజోలి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుద్ధ నీరు అందడం లేదు. పాఠశాలలో రెండు నీటిశుద్ధి యంత్రాలున్నా.. బాగు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. **- మధు, ఓ విద్యార్థి తండ్రి**

పరిష్కారం: చాలా రోజుల నుంచి సమస్య ఉన్నమాట వాస్తవమే. వాటిని బాగు చేసేందుకు నిధుల అవసరం ఉంది. విద్యార్థులకు ఇబ్బంది ఉన్న సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా చర్యలు చేపడతాం. **- భగీరథరెడ్డి, ఎంఈవో**

-న్యూస్‌టుడే, రాజోలి

తెరపై ఈనాడు

గద్వాల : ఎస్వీసీ సినిమాస్... **దేవర, సత్యం సుందరం**
అయిజ: శివసాయి : **దేవర,** భువనేశ్వర్ : **100 కరోడ్స్**
మాధవ్ : **సత్యం సుందరం**

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

రహదారిపై కూలిన చెట్టు

మల్దకల్, న్యూస్‌టుడే: అమరవాయి, సద్దలోనిపల్లె రహదారిలో మధ్యన బుధవారం గాలికి వేపచెట్టు నేలకొరగడంతో ప్రమాదం పొంచి ఉంది. రహదారికి అడ్డంగా కూలిన చెట్టును సంబంధిత అధికారులు తొలగించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రొడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మలతో వాహనచోదకులకు ప్రమాదం పొంచి ఉంది. విరిగి పడిన కొమ్మలను తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు.

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు కనీస ధర నిర్ణయించి చట్టం చేయాలని వనపర్తి జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య బుధవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. భాజపా ప్రభుత్వం రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు బాలయ్య, మురళి, కురుమయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్థులు రూ.50 వేలు విరాళం సమకూర్చారు. విరాళాన్ని బుధవారం సీఐ శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎనిమిది సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉండగా గ్రామస్థులు స్వచ్ఛందంగా విరాళం సమకూర్చడం అభినందనీయమన్నారు. ఎస్సై నరేందర్, మాజీ సర్పంచి తుకారాం, గ్రామపెద్దలు మాసన్న, సత్యన్న, హటెల్లి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత


గద్వాల రాజీవ్‌మార్గ్‌లోని లాల్ బహదూర్‌శాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు


వడ్డేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో..

నేటి యువతకు మహాత్ముడే స్ఫూర్తి


ఇటిక్యాల: గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నమస్కరిస్తున్న అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం

గద్వాల గ్రామీణం, కలెక్టరేట్, మల్దకల్, రాజోలి, ఇటిక్యాల, అయిజ, శాంతినగర్, వడ్డేపల్లి, గట్టు, ఉండవల్లి, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం పేరు చెబితే గుర్తొచ్చేది మహాత్మాగాంధీనే అని ఆయనను స్ఫూర్తిగా నేటి యువత తీసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో బుధవారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్వాలలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత, పురపాలిక ఛైర్మన్ బీఎస్ కేశవ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ● నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగ్లల రంజిత్‌కుమార్, సమితి కార్యాలయంలో ఇద్దరు నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. ● పీజీ సెంటర్‌లో ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాము, కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు గాంధీ చౌక్‌లోని నివాళులర్పించారు. ● మల్దకల్‌లో ఆర్యవైశ్య సంఘం రాష్ట్రకార్యదర్శి సభ్యుడు మనసాని నాగరాజు, బిజ్వారంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మల్దకల్‌లో భాజపా నాయకులు రాముడు నివాళులర్పించారు. ● రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ● ఇటిక్యాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్, ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో అదనపు కమాండెంట్ సుబ్రహ్మణ్యం ● అయిజలోని గాంధీచౌక్‌లో పుర ఛైర్మన్ దేవన్న తదితరులు నివాళి అర్పించారు. ● శాంతినగర్, వడ్డేపల్లి, రామాపురం, కొంకల, జిల్లెడదిన్నె, పైపాడు, జూలేకల్, తనగల గ్రామాల్లో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ● గట్టులో గాంధీ మాజీ సర్పంచి ధనలక్ష్మి సింగిల్‌విండో కార్యాలయంలో అధ్యక్షుడు వెంకటేష్, మండల పరిషత్తులో ఎంపీడీవో చెన్నయ్య ● ఉండవల్లి మండలం తక్కశిలలో ఎమ్మెల్యే విజయుడు నివాళులర్పించారు.


ఉండవల్లి: తక్కశిలలో ఎమ్మెల్యే విజయుడు


రాజోలి: మాన్‌దొడ్డిలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గ్రామస్థులు


గట్టు మండలం కేంద్రంలో..


అయిజలో పూలమాల వేస్తున్న పుర ఛైర్మన్ దేవన్న, కౌన్సిలర్లు


గద్వాలలో నివాళులర్పిస్తున్న రంజిత్‌కుమార్

గ్రామసభలో సమస్యలపై చర్చ

రాజోలి, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ రాజోలిలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పలు సమస్యలను చర్చించారు. గ్రామంలోని కొన్ని కాలనీలో బ్లీచింగ్ వేయడం లేదని పలువురు తెలిపారు. చేనేత కార్మికుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణం చేయాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం ప్రణాళికలను చర్చించారు. ఉసేన్, దస్తగిరి, మూగెన్న, వెంకటేశ్వర్లు, సంజీవ్‌రెడ్డి, భాస్కర్ తదితరులున్నారు.


సమస్యలపై చర్చిస్తున్న గ్రామస్థులు

గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

అయిజ, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించేందుకే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని ఎంపీడీవో వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మేడికొండలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈనెల 2నుంచి 31వరకు గ్రామాల్లో నిర్వహించనున్న ప్రజా ప్రణాళిక ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రణాళిక తయారీలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త పవన్‌కుమార్, గ్రామ కార్యదర్శి దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కేటీదొడ్డి ఎస్సై బదిలీ

ధరూరు, న్యూస్‌టుడే: కేటీదొడ్డి ఎస్సైగా పని చేస్తున్న శ్రీనివాసరావును జిల్లా పోలీసు కార్యాలయం డీసీఆర్బీలో రిపోర్టు చేయాల్సిందిగా ఐజీ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది. ఆయన స్థానంలో డీసీఆర్బీలో ఉన్న బి.శ్రీనివాసులకు కేటీదొడ్డి ఎస్సైగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు సమాచారం.

గుర్తించిన పనులే చేయాలి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: లేబర్ బడ్జెట్ ప్లాన్‌కు గుర్తించిన పనులనే చేపట్టాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సెప్టెంబరు 17న మొదలైన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఆదివారం కొంకల, తనగల, రామాపురం, బుడమర్సు, జూలేకల్, కొయిలదిన్నెలతో పాటు మొత్తం పంచాయతీల్లో గ్రామసభతో ముగిసింది. కొయిలదిన్నె సభకు ఎంపీడీవో హాజరయ్యారు.

ఉచిత వైద్య సేవలు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని కృష్ణవేణి చౌరస్తా సమీపంలో ఉన్న శివగంగే ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులను ఆస్పత్రి వైద్యుడు అభినేష్, తన సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. గుండె, ఊరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 405 మంది రోగులకు ఉచితం పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్టు డాక్టర్ అభినేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్యకర్తలకు భారాస పార్టీ అండ

ఉండవల్లి, న్యూస్‌టుడే: భారాస పార్టీ కార్యకర్తలకు, పేదలకు అండగా ఉండి ఆదుకుంటుందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం మారమునగాల -1 గ్రామంలో లబ్ధిదారు లక్ష్మిదేవమ్మకు రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. లక్ష్మిదేవమ్మ భర్త గొల్ల వెంకట్రాముడు మృతిచెందడంతో భారాస పార్టీ తరపున వచ్చిన చెక్కును ఆమె అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీకి 60 లక్షల మంది సభ్యత్వం ఉండటం గర్వకారణమని, దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి ఇంత పెద్ద ఎత్తున సభ్యత్వం లేదన్నారు. కలుగొట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, నాయకులు రఘురెడ్డి, కురుమూర్తి, రవిప్రకాష్ గౌడ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



అసంపూర్తి పనులతో అవస్థలు

జల్లాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో ప్రాంగణంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు కూడా కొనసాగుతున్నాయి. పాఠశాలలో నూతన గదుల నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇందుకోసం తోలిన కంకరకుప్ప కొన్ని నెలలుగా అడ్డుగా ఉండటంతో విద్యార్థులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు రాగానే పనులు పూర్తి చేయిస్తామని ఎంఈవో శివప్రసాద్ తెలిపారు.

-న్యూస్‌టుడే, మానవపాడు

ముల్లదిన్నె గ్రామంలో తుమ్మల వాగుపై వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాగు మీదుగానే వడ్డేపల్లికి వందలాది ఎకరాల పొలం సాగుకు రైతులు వెళ్తుంటారు. వాగుపై వంతెన లేకపోవడంతో నిత్యం నీటిని దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు కురిస్తే.. వరద ఉద్ధృతితో దాటడం ఇబ్బందిగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని ఎంపీడీవో ఖాజా మొహినుద్దీన్ తెలిపారు.

-న్యూస్‌టుడే, రాజోలి

బ్రిడ్జి నిర్మించండి సారూ!





ప్రమాదకరంగా నియంత్రిక

ధరూరు బీసీ కాలనీకి వెళ్లే దారిలో నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. చుట్టూ కనీసం రక్షణ కంచె లేకపోవటం, ప్రధాన అంతర్రాష్ట్ర రహదారి పక్కనే ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. కనీసం రక్షణ కంచె ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. ఏఈ అనిల్‌కుమార్‌రెడ్డి వివరణ కోరగా పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

-న్యూస్‌టుడే, ధరూరు

అయిజ-కర్నూలు మార్గంలోని అయిజ సమీపంలో ఉన్న పెద్దవాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. అయిజ నుంచి కర్నూలు వెళ్లాలంటే ఇదొక్కటే మార్గం. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెన దెబ్బతిని రంధ్రం పడింది. ఆ ప్రాంతంలో వాహనాలు తిరగకుండా చర్యలు చేపట్టారు. రంధ్రాన్ని పూడ్చి మళ్లీ యథావిధిగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వంతెన ఎప్పుడు కూలుతుందా అన్నట్టుంది.

-న్యూస్‌టుడే, అయిజ

శిథిల వంతెనపై తప్పని ప్రయాణం



కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న నాయకుడు రాజు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ పట్టణ కేంద్రంలో బుధవారం కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు వెంకటస్వామి ఎంపీడీవో కార్యాలయం ముందు సంఘం జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ 26 ఏళ్ల కాలంలో దళితుల పక్షాన అనేక పోరాటాలు చేసి విజయం సాధించినట్లు గుర్తు చేశారు. నేటికి గ్రామాల్లో అంటరానితనం కుల వివక్షరూపాలు కొనసాగుతున్నాయని రెవెన్యూ అధికారుల 1955 పౌర హక్కుల చట్టం ప్రకారం గ్రామాలను సందర్శించడం లేదన్నారు. కార్యదర్శి నాగరాజు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న, మౌలాలి, మద్దిలేటి, బాషా, మునిస్వామి, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై చర్యలకు వినతి


ఆత్మకూరు పుర కమిషనర్ నాగరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలికలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మనివర్ధన్‌రెడ్డి, గంగ, నాగేశ్వర్, గడ్డం శ్రీకాంత్, వంశీ, ఎండీ రఫీక్, రమేష్ యాదవ్, హమాలి అంజి, రామకృష్ణ యాదవ్ తదితరులు పుర కమిషనర్ నాగరాజుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది జూన్ 24న పురపాలికలో పదిశాతం ప్రభుత్వ స్థలాలతో పాటు ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడంతో పాటు బినామీల పేరిట క్రయ, విక్రయాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సిఫారసు లేఖతో మరోసారి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు


మానవపాడు: అలంకరణలో ఆంజనేయస్వామి


గట్టులో భవానీమాత


మల్దకల్‌లో వాసవీకన్యకాపరమేశ్వరి


ధరూరు: పాగుంట ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మల్దకల్, శాంతినగర్, గట్టు, ఇటిక్యాల, మానవపాడు, ధరూరు, వడ్డేపల్లి, ఉండవల్లి, న్యూస్‌టుడే: మల్దకల్ ఆదిశిలాక్షేత్రం ఆవరణలో వెలిసిన వాసవీకన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 12వ రకు దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బాదం శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు ఇల్లూరు నాగరాజు తెలిపారు. రోజూ ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు అభిషేకం, అనంతరం అలంకరణ, హోమం, మంగళహారతి, రాత్రి కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, వేదాంత ప్రవచనాలు, మంగళహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ● శాంతినగర్‌లోని రాముల వారి ఆలయం, వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయాలలో ఉత్సవాలకు కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. ● గట్టు భవానీమాత ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక సోమవంశక్షత్రియ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

అమావాస్య పూజలు: అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ఆంజనేయస్వామి దర్శనానికి భక్తులు బీచుపల్లికి తరలివచ్చారు. ముందుగా పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటి సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈవో రామన్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. ● మానవపాడుతో పాటు కలుకుంట్ల, కొర్విపాడు, జల్లాపురం, బోరవెల్లి, చెన్నిపాడు, నారాయణపురం, చంద్రశేఖర్‌నగర్, అమరవాయి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో దేవతామూర్తులకు అర్చకులు అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజ నిర్వహించారు. ● ధరూరు, కేటిదొడ్డి మండలాల పరిధిలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పాగుంట వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం చేశారు. పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కర్ణాటక చిత్రదుర్గ జిల్లా దొడ్డసిద్ధవనం గ్రామంకు చెందిన అడిషనల్ ఎస్పీ హరీశ్ రూ.50 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ● వడ్డేపల్లి, శాంతినగర్, కొంకల, పైపాడు, జూలేకల్ ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ● గట్టులోని గండి ఆంజనేయస్వామి, మాచర్లలో చెన్నకేశవస్వామి దేవాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● ఉండవల్లిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికురాలి ఆకస్మిక మృతి

ధరూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఉదయం 6గంటలకు ఎస్సీ కాలనీలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు శంకరమ్మ(45) పనులు చేస్తూచేస్తూనే అస్వస్థతకు గురైంది. చికిత్స నిమిత్తం తరలించటానికి 108 అంబులెన్స్‌కు కాల్ చేసినా అందుబాటులోకి రాలేదు. ప్రైవేటు వాహనంలో గద్వాలకు తరలించగా అప్పటికే మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులకు పంచాయతీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రాజోలి, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందగా, బుధవారం రాజోలి ఠాణాలో కేసు నమోదైనట్లుగా ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. పెద్దధన్వాడ గ్రామానికి చెందిన వీరేశ్(25)కు, కొన్ని నెలల కిందట గట్టు మండలం బోయలగూడెంకు చెందిన బీమక్కతో వివాహం జరిగింది. దాదాపు నెల రోజుల కిందట వీరేశ్ తన భార్య పుట్టింట్లో ఉండగా, అక్కడ జరిగిన గొడవ కారణంగా బీమక్క పురుగుల మందు తాగి మృతిచెందింది. భార్య మరణంతో కొంత కాలంగా మదన పడుతున్న వీరేశ్ కూడా గత నెల 25వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు.

తప్పిపోయిన చిన్నారి


చిన్నారి జమ్మన్న (ఫైల్ ఫొటో)

అయిజ, న్యూస్‌టుడే: అయిజ పట్టణానికి చెందిన ఏడాదిన్నర చిన్నారి జమ్మన్న గతనెల 28 నుంచి కనిపించడంలేదు. పట్టణంలోని మేడికొండ చౌరస్తా సమీపంలో ఉన్న మైదానంలో చిన్నారి తండ్రి రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి గుడిసెలో నివసిస్తున్నాడు. ఈనెల 28 సాయంత్రం ఇంట్లో నుంచి ఆడుకుంటూ బయటికి వెళ్లాడు. ఆతరువాత కనిపించడం లేదు. తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయభాస్కర్ పేర్కొన్నారు.

తుంగభద్ర నదిలో తగ్గుతున్న ప్రవాహం

శాంతినగర్, రాజోలి, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో బుధవారం ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 8.6 అడుగుల ఎత్తులో 4,329 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.3 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా రాష్ట్రానికి వచ్చేసరికి అది 5 అడుగులుగా ఉంది. * సుంకేసుల జలాశయానికి 6,800 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ఒక గేటు ద్వారా 4,400 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లుగా జేఈ రాజు తెలిపారు.

గర్భిణులకు అమ్మ కోసం


యాప్‌పై ఏఎన్‌ఎంలకు శిక్షణ

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గర్భిణుల కోసం తెలంగాణ ప్రభుత్వం 'అమ్మకోసం' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గర్భిణుల్లో ప్రధానంగా వచ్చే రక్తహీనతతో పాటు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలను అరికట్టేందుకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లాలో రక్తహీనత సమస్యతో బాధపడే వారు ఎంత మంది ఉన్నారు? ఆ సమస్య ఎలా అరికట్టాలి? ఎలాంటి ఆహారం తీసుకోవాలి? అసలు సమస్య రాకుండా ముందస్తుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు.

గర్భం దాల్చిన మూడు నెలల నుంచి

మహిళ గర్భం దాల్చిన మూడు నెలల నుంచి వైద్య సేవలు అందిస్తారు. ప్రతి నెల గర్భిణి ఆరోగ్య పరిస్థితి, పిండం ఎదుగుదలను పరిశీలిస్తారు. ఎక్కువ ప్రమాదకర స్థాయి పరిస్థితిలో ఎలాంటి వైద్యం అందించాలి, ఎక్కడికి తీసుకెళ్లాలని అంశాలపై ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పిస్తారు. ప్రతినెల నిర్వహించే వైద్య పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదైన సమస్య ఉంటే వెంటనే నివారణ కోసం వైద్యులను సంప్రదిస్తారు. గర్భిణులు మధుమేహం బాధితులుంటే.. బిడ్డకు సోకకుండా వైద్యుల సూచనతో మందులు అందించడం, ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అవగాహన కల్పిస్తారు.



అమ్మ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్

క్విజ్ పోటీలు

అమ్మకోసం యాప్ ద్వారా రోజూ ఏఎన్‌ఎంలకు చరవాణిలో దృశ్య, శ్రవణం ద్వారా గర్భిణులకు అందించే వైద్య సేవలపై వివరిస్తారు. ప్రధానంగా గర్భిణుల్లో వచ్చే రక్తహీనతను సకాలంలో గుర్తించి ముందే నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎదురయ్యే ఎక్కువ ప్రమాదస్థాయి (హైరిస్క్)ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఏఎన్‌ఎంలు విని, నేర్చుకున్న అంశాలపై వారి సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఆన్‌లైన్‌లోనే వారికి క్విజ్ పోటీలు నిర్వహిస్తారు.

ప్రమాదస్థాయి తగ్గించేందుకే..

గర్భిణుల్లో రక్తహీనతను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే కాన్పు సమయంలో ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రమాదకర పరిస్థితులుంటే మాతాశిశు సంక్షరణ కేంద్రాలకు తీసుకెళ్లి వైద్య సేవలందిస్తాం. ప్రతి మూడు నెలలకు వైద్య పరీక్షలు నిర్వహించి పిండం ఎదుగుదల, ఆరోగ్య సమస్యలుంటే గుర్తించి ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటాం.

- డి.ఝాన్సీ, జిల్లా మాతాశిశు సంరక్షణ కార్యక్రమ అధికారిణి